5కె రన్‌లో సీతానగరం యువకుడికి ద్వితీయ స్థానం

విశాలాంధ్ర-సీతానగరం : జిల్లాలో ఎయిడ్స్ పై అవగాహన కోసం మంగళవారంనాడు పార్వతీపురంలో నిర్వహించిన 5కె రన్ మారథాన్ కార్యక్రమంలో సీతానగరం మండలానికి చెందిన ఎం.అజయ్ కుమార్ రన్నింగులో ద్వితీయస్థానం సాధించి 7వేల రూపాయలు నగదు బహుమతిని గెలుచుకున్నారు. అజయ్‌కు కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా ఎయిడ్స్ అధికారి డాక్టర్ మంతిని వినోద్ కుమార్ తదితర అధికారుల చేతుల మీదుగా 7వేల రూపాయల చెక్కును తీసుకున్నారు. కెఎస్ఆర్ అకాడమీ నుండి హాజరై 5కె రన్ మారథాన్‌లో ద్వితీయ బహుమతి పొందిన అజయ్‌ను కెఎస్ ఆర్ అకాడమీ కోచ్ శంకరరావు, అకాడమీ సభ్యులు, సీతానగరం పురప్రముఖులు, మెట్టువీధి యువకులు, తోటియువకులు అభినందించారు.

ఏపీ రోడ్డు డవలప్మెంట్ డైరెక్టర్‌గా ద్వారపురెడ్డి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ రోడ్డు డవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.తనపై నమ్మకం ఉంచి రోడ్డు డవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌కు, జిల్లా నాయకులకు, బీజేపీ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

డ్రోన్ ద్వారా ద్రవ జీవామృతం స్ప్రేయింగ్

విశాలాంధ్ర-బలిజిపేట : మండలం తుమరాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇంచార్జ్ లక్ష్మి సమక్షంలో ఏపీసీఎన్ఎఫ్ పార్వతిపురం మన్యం జిల్లా డిపిఎం మూడడ్ల శ్రావణ్ కుమార్ క్షేత్రంలో డ్రోన్‌తో పేడ మూత్రం ఇంగువ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ డ్రోన్‌తో స్ప్రే చేయించడం వలన రైతుకు సమయం మరియు డబ్బు ఆదా అవుతుందని, వ్యవసాయ కూలీలు తక్కువగా ఉన్న ఈ తరుణంలో రైతులు టెక్నాలజీ మరియు మెషినరీ వైపు దృష్టి సారించి లబ్ది పొందాలని వివరించారు. అలాగే వెంగాపురంలో ఈవీఏపి సునీత సమక్షంలో జరిగిన పొలం బడి కార్యక్రమంలో ద్రవ జీవామృతాన్ని స్ప్రేయింగ్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు మరియు ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా యూరియా సరఫరా : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రైతుల అవసరాల మేరకు నిరంతరంగా యూరియా సరఫరా చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,177 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉందని (ప్రైవేట్ దుకాణాలలో 175 టన్నులు & రైతు సేవా కేంద్రాల వద్ద 1002 టన్నులు) అన్నారు.గడచిన వారంలో 1,157 టన్నుల యూరియా సరఫరా కాగా, వీటిని అర్హులైన రైతులకు వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది సంయుక్త పర్యవేక్షణలో సోమవారం పంపిణీ చేసినట్లు చెప్పారు.ఈ నెల 10వ తేదీన కోరమాండల్ కంపెనీ నుంచి 350 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కానుందని, మరో వారం రోజుల్లో అదనంగా 1,000 మెట్రిక్ టన్నుల యూరియా ఐపీఎల్ కంపెనీ ద్వారా గంగవరం పోర్టు నుండీ రోడ్డు మార్గంలో జిల్లాలో రైతు సేవా కేంద్రాలకు సరఫరా కానున్నట్లు వివరించారు. రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందుబాటులో తెస్తున్నామని, రానున్న రోజుల్లో సమృద్ధిగా మరింత యూరియా ఎరువుల సరఫరా కానుందని పేర్కొన్నారు. కావున రైతులెవరూ ఎరువులను ముందస్తుగా కొనుగోలు చేయవద్దని మనవి చేశారు. రైతులు తప్పనిసరిగా తమ వేలిముద్రలు నమోదు చేసుకుని, ఆధార్ అధీకృత విధానం ద్వారా యూరియా కొనుగోలు చేయాలని అన్నారు.జిల్లాలో ప్రస్తుతం 1,192 టన్నుల డీఏపీ, 1,279 కాంప్లెక్స్ ఎరువులు, 670 పోటాష్, 888 సూపర్ ఫాస్ఫేట్ ఎరువులు సరిపడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అధిక ధరలకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని, ఎరువుల చట్టం ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రంలో 94401 04317 & 79894 34766 ఫోన్ నంబర్లతో ఒక కంట్రోల్ విభాగం ఏర్పాటు చేశామని,రైతులు ఎవరైనా సరే యూరియా సరఫరాలో ఇబ్బందులు ఉంటే పైనెంబర్లను సంప్రదించవచ్చని గుర్తుచేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా, సమయానుకూలంగా అందుతున్న యూరియాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

యూరియా కొరత లేదంటూ అధికారుల మేకపోతు గాంభీరం

ఒక్కో మూట చొప్పున రైతుకు పంపిణీ : సీపీఐ

విశాలాంధ్ర-బెలగాం : రైతులకు యూరియా సరఫరాలో అవ్యవస్థలు చోటుచేసుకుంటున్నాయని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్వీఎస్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం యూరియా కొరత లేదని ప్రచారం చేస్తూ మేకపోతు గంభీరం ప్రదర్శిస్తోందని, అయితే రైతులకు ఒక్క మూట చొప్పున్నా మాత్రమే యూరియా అందించడం ఎలా సమంజసమౌతుందో అధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం పంట కీలక దశలో ఉండగా రైతులకు యూరియా అత్యవసరమని గుర్తు చేస్తూ, రైతు కష్టాలను రెట్టింపు చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యమే కాకుండా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపట్టే దిశగా సిపిఐ పార్టీ కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని కుమార్ హెచ్చరించారు. రైతుల పంటల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను తక్షణం విరమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సింహాద్రి దుర్గారావు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం... రోగులకు మెరుగైన సేవలు అందించండి

ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో గల చినమేరంగి సి హెచ్ సి లో మంగళవారం రాష్ట్ర విప్ కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ తరహాలో వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తుందని కురుపాం నియోజకవర్గ శాసన సభ్యురాలు రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి అన్నారు. అయితే ఈ కార్యక్రమం లో ముందుగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆర్ ఆర్ కె చైతన్య ఆసుపత్రిలో అందిస్తున్న పలు రకాలైన వైద్య సేవలు అదేవిధంగా పౌష్టికాహారం ఇస్తున్న తీరును ఆమెకు పూర్తిగా వివరించారు. అంతేకాకుండా ఆసుపత్రిలో డ్రైనేజీ వ్యవస్థ బాగా లేదని ప్రహరీ గోడ కూడా లేదని ఆసుపత్రికి వస్తున్న మార్గంలో లైట్లు లేని విషయం తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని ఆమె సమావేశంలో అన్నారు డాక్టర్ల కొరత ఉందని తెలిసిందని ఆమె అన్నారు రోగుల సౌకర్యార్థం పెద్ద ఎక్సరే కావాలని పోస్టుమార్టం ఏర్పాటు చేయాలని టాయిలెట్ల మరమ్మత్తులు కూడా ఉన్నాయని తెలిసిందని ఆమె అన్నారు ఈ సమస్యలన్నీ పరిష్కరించడంతోపాటు మరిన్ని సౌకర్యాలు అందించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి తప్పక నిధులు మంజూరు చేయిస్తానని ఆమె స్పష్టం చేశారు అయితే నేను అందుబాటులో లేని సమయంలో ఏదైనా అత్యవసర అవసరాలు ఆసుపత్రికి వచ్చి ఉంటే ఆసుపత్రి కమిటీ సభ్యుల తీర్మానంతో నిధులు ఖర్చు చేసి సమస్య లేకుండా చూడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య కు ఆమె ఆదేశించారు. ముఖ్యంగా రోగులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సేవలు అందించడమే మీ ముందున్న ప్రధాన లక్ష్యంగా చూడాలని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు ఎంపీపీ బొంగు సురేష్ అరకు పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ రావాడ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మూడడ్ల సత్యమనాయుడు చిన మేరంగి రెడ్డి పిఏసిఎస్ బలరామస్వామి నాయుడు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర విప్, కలెక్టర్‌లు సందర్శన

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంను రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి ,జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న సేవలు సూపరింటెండెంట్ సందీప్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాలు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న వసతులు కొరత ద్రుష్ట్యా నూతన భవనం వీలైనంత వరకు అందుబాటులోకి తీసుకుని వచ్చే విధంగా పెండింగ్ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసి ఇవ్వాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణ రావు, లెప్రసి/టీబి కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్, తెదేపా కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారశాఖ డిపిఆర్ఓ రమేష్‌కు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి

విశాలాంధ్ర- పార్వతీపురం : పార్వతీపురం మన్యంజిల్లా సమాచార శాఖలో జిల్లా పౌర సంబంధాల శాఖాధికారిగా పనిచేస్తున్న లోచర్ల రమేష్‌కు సమాచార శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి ఇస్తూ గుంటూరు బదిలీ చేశారు. ఆయన నేడు రిలీవ్ కానున్నారు. పార్వతీపురం మన్యంజిల్లా ఏర్పడిన తర్వాత రమేష్ విశేషమైన సేవలు అందజేశారు. ఆయన పదోన్నతి పట్ల జిల్లాలోని జర్నలిస్ట్ సంఘాల యూనియన్ నాయకులు, పత్రికా విలేకరులు, జిల్లాలోని అధికారులు అభినందనలు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాకు డిపిఆర్ఓగా శ్రీకాకుళం జిల్లా నుండి సింగ్ రానున్నట్లు తెలిసింది.

నాటు సారా నిర్మూలిద్దాం... గ్రామాలను సస్యశ్యామలంగా తీర్చిదిద్దుదాం...

విశాలాంధ్ర-పాలకొండ : నాటు సారాని నిర్మూలన చేసి అన్ని ప్రాంతాలను సస్య శ్యామలంగా తీర్చిదిద్దామని స్థానిక ఎంపీపీ బొమ్మాలి భాను పేర్కొన్నారు మంగళవారం నవోదయం టు పాయింట్ జీరో కార్యక్రమం స్థానిక మండల సమావేశం మందిరంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో పట్టణాలలో సారాను నిర్మూలన చేసి ప్రగతికి పాటుపడదామని పిలుపునిచ్చారు సారా తాగితే అధోగతి మానితే పురోగతి అనే అంశాలపై వక్తలు మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి ఎస్సై ప్రయోగ మూర్తి చైర్పర్సన్ ఆకుల మల్లీశ్వరి టిడిపి నాయకుడు కర్నేన అప్పలనాయుడు వాకమూడి అనిల్ కుమార్ బొమ్మాలి సుధాకర్ తదితరులు ఉన్నారు.

గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఎంపిఎస్ఎంఎ ప్రోగ్రాం ద్వారా గర్భిణీలకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి ఉషారాణి తనిఖీలు నిర్వహించారు. సుమారు 50మందికి తనిఖీలుచేసి, అన్ని పరీక్షలు నిర్వహించి వారికి జాగ్రత్తలు తెలియజేసి మందులను అందజేశారు. రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ప్రతినెల 9న గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక తనిఖీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆమెతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎరువుల సరాఫరాను అధికారులు పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పలు రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులను అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం వి.ఇప్పలవలస, పాపమ్మవలస గ్రామాల్లో జరుగుతున్న ఎరువులు పంపిణీను మండల ప్రత్యేక అధికారి (డీఎం సివిల్ సప్లై), తహసిల్దార్ ప్రసన్నకుమార్, ఇంచార్జి ఎంపిడిఓ కుమార్ వర్మ, మండల వ్యవసాయ అధికారి అవినాష్ల దగ్గరుండి అందజేసారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణుల గృహ నిర్బంధం

విశాలాంధ్ర-మక్కువ : రాష్ట్రంలో రైతన్నలకు యూరియా కొరతపై మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ చేపడుతున్న రైతు పోరుబాట కార్యక్రమానికి బయలుదేరుతున్న వైసీపీ శ్రేణులను వారి ఇండ్ల వద్దనే పోలీసులు అరెస్ట్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరగనున్న "రైతు పోరుబాట" కార్యక్రమానికి బయలుదేరుతున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్వతీపురం కురుపాం) మావుడి శ్రీనివాస్‌నాయుడుని, మక్కువ మండల వైసీపీ అధ్యక్షులు మావుడి.రంగునాయుడుని, మక్కువ మండల వైసిపి నాయకులను కార్యకర్తలను మక్కువ మండల పోలీసులు గృహనిర్బంధం చేశారు.

వెలగలపాలెంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

సర్పంచ్ 'ఇరవాడ రత్నకుమారి'

విశాలాంధ్ర-కొయ్యూరు : లబ్ధిదారులందరికీ సక్రమంగా రేషన్ అందాలని అనే సంకల్పంతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని వెలగల పాలెం సర్పంచ్ ఇరవాడ రత్నకుమారి అన్నారు. మంగళవారం వెలగలపాలెం పంచాయితీ పరిధిలో గల గ్రామాల్లో రేషన్ కార్డుల లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇరవాడ రత్నకుమారి మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ ప్రభుత్వం అందించే సరుకులు అన్ని సక్రమంగా అందాలని నూతన వరవడికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో సచివాలయం డిఏ, వీఆర్వో చిరంజీవి పంచాయతీ వార్డు మెంబర్లు రాంబాబు సత్యవతి కొండబాబు లబ్ధిదారులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముంపు మండలాల పర్యటనను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కూనవరం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ముంపు మండలాల పర్యటన ఈనెల 16న కూనవరంలో మొదలవుతున్నందున పర్యటనను జయప్రదం చేయవలసిందిగా సిపిఐ ఎటపాక డివిజన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం కూనవరం పార్టీ కార్యాలయంలో ఎటపాక డివిజన్ పార్టీ సహాయ కార్యదర్శి వాసం రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. పోలవరం ముంపు ప్రజల పరిహారం పునరావాసం పై ప్రభుత్వాలు చేస్తున్న కాలయాపనను ప్రశ్నించేందుకు, తక్షణమే నిర్వాసితులందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే ఈ కార్యక్రమాన్ని ప్రతి నిర్వాసితులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్‌రావు కూనవరం మండల కన్వీనర్ లంబు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జుత్తుక సూర్యచంద్రరావు, సూరం వెంకటేశ్వర్లు, బుడిపిటీ వెంకటేశ్వర్లు, ఎటపాక మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, గన్నవరం ఎంపీటీసీ కంటే రాజు, వరద బ్రహ్మం, విఆర్ పురం మండల కన్వీనర్ కర్నాటి ఏసు కామేశ్వరరావు, చింతూరు నాయకులు ఎస్కే రంజాన్, తదితరులు పాల్గొన్నారు.

కాఫీకి బెర్రీ బోర్రర్‌తో అధికారులు వర్రీ

- రైతులకు అవగాహన కలిగించేందుకు కాఫీ తోటలకు క్యూ కట్టిన ఉద్యోగులు, అధికారులు

- బెర్రీ బోర్రర్ నుంచి కాఫీ తోటలను కాపాడడమే లక్ష్యం

విశాలాంధ్ర-చింతపల్లి: కాఫీ పంటకు బెర్రీ బోర్రర్ వ్యాధి సోకడంతో ఆ శాఖ అధికారులలో ఆందోళన (వర్రీ) మొదలైంది. కాఫీ పంటను నాశనం చేసే ఈ వ్యాధిని ఆదిలోనే అంతం చేయాలనే లక్ష్యంతో ఆ శాఖలోని క్షేత్ర స్థాయి కార్మికుల నుంచి ఉన్నతాదికారుల వరకు ప్రతి ఒక్కరూ కాఫీ తోటలకు క్యూ కట్టారు. ఈ క్రమంలో కాఫీ రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి నివారణకు సర్వే ల ద్వారా రెడ్, బ్లూ, గ్రీన్, ఎల్లో జోన్‌లుగా విభజించి వ్యాధి సోకిందని అనుమానం కలిగిన తోటలలో పంటను తొలగించడం సహా తొలగించిన పంట (కాఫీ) ను వేడి నీటిలో బాగా ఉడికించి అనంతరం మూడు మీటర్ల గుంతలో పూడ్చి పెడుతున్నారు. పొరపాటున తోటలో వ్యాధి సోకిన ఒక్క గింజ ఉన్నా బోర్రర్‌లు వృద్ధి చెంది తోటలను నాశనం చేసే అవకాశం ఉన్నందున కాఫీ రైతులు అప్రమత్తంగా ఉండ వలసిన అవసరం ఎంతైనా ఉంది. నాడు (2020లో) మానవాళికి సోకిన కరోనా వైరస్ వలె నేడు(2025లో) కాఫీకి బెర్రీ బోర్రర్ వైరస్ సోకి తోటలను నాశనం చేస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కాఫీ రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

అనారోగ్యంతో బూధరాళ్ల ఉపాధ్యాయుడు మృతి

శ్రద్ధాంజలి ఘటించిన ఎంఈఓ యూనియన్ నాయకులు

విశాలాంధ్ర-కొయ్యూరు : గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడు గోకిరి రామకృష్ణ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన గోకిరి రామకృష్ణ గత కొన్నేళ్లుగా భూధ రాళ్ల ఎంపీపీ ఎస్ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. రామకృష్ణ ఉపాధ్యాయ వృత్తికి రాకముందు వివిధ దినపత్రికల్లో పాత్రికేయుడుగా పనిచేస్తూ మారుమూల గ్రామాల గిరిజన సమస్యలను వెలికి తీసి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. దీంతో మండల ప్రజలందరికీ సుపరిచితుడు. రామకృష్ణ మృతి చెందడంతో ఎంఈఓ రాంబాబు యూనియన్ నాయకులు కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఉపాధి పని డబ్బులు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-కూనవరం : గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల పని డబ్బులు వెంటనే చెల్లించాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ డివిజన్ కమిటీ ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో కి వినతి పత్రం అందించారు. చుట్టూ వరదలు చేరి పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీల డబ్బులు చెల్లించకపోవడం సరైనది కాదని తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఉపాధి కూలీలందరికీ పని డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు సహాయ కార్యదర్శి వాసం రాము, కంటే రాజు, వెలిశాల నాగరాజు వరద బ్రహ్మం, ఎస్.కె రంజాన్, లంబ శ్రీనివాసరావు, కర్ణాటక ఏసు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గింజంగి సిసి రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-జీకే వీధి : మొండిగెడ్డ పంచాయితీ గింజంగి గ్రామంలో జిల్లాపరిషత్ నిధులతో 90 మీటర్ల సీసీ రోడ్ సర్పంచ్ అడపా ప్రియాంక, ఎంపీపీ బోయినకుమారి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అలాగే గింజంగి గ్రామస్థులు జడ్పీటీసీ మత్స్యరాస శివరత్నంకీ కృతజ్ఞతలు తెలుపుకుంటు ఆనందం వ్యక్తం చేసారు. ఈకార్యక్రమానికి గ్రామ పెద్దలు జర్త బాలన్న, సత్యనారాయణ వైస్సార్ సీపీ నాయకులు బోయిన వెంకట్, గబులంగి సతీష్‌కుమార్, లింగేశ్వరావు వార్డ్ మెంబెర్ కందుల లక్ష్మణారావు, వంతల రాజు, కూటమి నాయకులు మాతే కామరాజు కోరాబు పంద పడల్ వంతల లక్ష్మయ్య పొత్తూరు రాజు గ్రామస్థులు పొత్తూరు కృష్ణ మచ్చల మత్యరాజు గబులంగి హరిబాబు పాల్గొన్నారు.

వల్లి సుందరంకు ప్రశంసాపత్రం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం. : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని శ్రీ రామగిరీ గ్రామంలో నివసిస్తున్న సీనియర్ ఆంధ్రప్రభ రిపోర్టర్ తన పేరులోనే కవితను ఇముడ్చుకున్న వల్లి కవితా సుందరం మంచి సాహితీవేత్త. కవిత్వం రాయడం పాటలు రాయడం, సామాజిక కోణంలో మంచి వార్తలు రాయడం సుందరం గొప్పతనం. గత 20 సంవత్సరాలుగా సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకుంటూ శ్రీ శ్రీ కళావేదిక నిర్వహించిన కవితల పోటీలో అద్భుతమైన తన సాహితీ పటిమ తో ప్రశంసా పత్రాన్ని అందుకున్నందుకు వల్లి కవితా సుందరం కు పలువురు అభిమానులు అభినందనలు తెలియజేశారు.

బస్ షెల్టర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-కొయ్యూరు : వనవాసి కళ్యాణ్ పరిషత్ రాష్ట్ర సంఘటన మంత్రి విద్యాధర్ మహంతి జీ కొయ్యూరు మండలం పర్యటించారు. పర్యటనలో భాగంగా అల్లూరి జిల్లా సమాచార హక్కు చట్టం కో ఆర్డినేటర్ & సామాజిక సేవకుడు అర్జున్ రెడ్డి వారితో కలిసి కొమ్మిక పంచాయతీ, బొర్రంపేట గ్రామంలో బస్ షెల్టర్ వద్ద పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. బస్ షెల్టర్ పరిసరాల్లో ప్లాస్టిక్ మరియు బీర్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోవడం చూసి శుభ్రం చేయడం జరిగిందని వారు తెలిపారు. బొర్రంపేట గ్రామానికి చెందిన యువకులకు బస్ షెల్టర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనవాసి కళ్యాణ్ పరిషత్ కార్యదర్శి ఉన్నారు.

ఆక్రమణలో హుకుంపేట పిఏసిఎస్ స్థలం!

సర్వే చేసి అప్పగించాలంటూ తహసిల్దార్‌కు వినతి

విశాలాంధ్ర-హుకుంపేట: కబ్జాలకు కాదేది కనర్హం అన్న చందంగా ఖాళీ స్థలాలు ఏవైనా ఉంటే కబ్జాదారుల కబంధహస్తాల్లో చిక్కిపోతున్నాయి. ప్రైవేట్ స్థలాలే కాకుండా ప్రభుత్వ స్థలాలను సైతం దర్జాగా కబ్జా చేసి వ్యాపారాలు చేసే లబ్ధి పొందుతు న్నారు. కబ్జా రాయుళ్ల అనే అభిప్రాయాలు బాహటంగా వినిపిస్తు న్నాయి. అల్లూరి స్థానిక హుకుంపేట మండలంలో ప్రాథమిక వ్యవ సాయ పరపతి సహకార సంఘంకు సర్వేనెంబర్ 71/1లో సుమారు 15 సెంట్లు స్థలం ఉంది. అక్కడ నాలుగు పాత గోదాములు, ఒక కార్యాల య భవనం ఉండగా మిగిలిన కాళీ స్థలం సైతం పిఏసిఎస్ ఆధీనంలో ఉంది. అయితే ఈ స్థలాన్ని గ్రామా నికి చెందిన కొంతమంది స్వార్ధపరులు ఆక్రమించుకొని దర్జాగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపా రులు చేస్తూ తన జేబులో నింపు కుంటున్నారు. ఏళ్ల తరబడి సొసైటీ స్థలంలో వ్యాపారం చేస్తూ లబ్ధి పొందుతున్న అక్రమణ దారులు సొసైటీ సిబ్బందిపై తిరగబడుతున్న సంఘ టనలు లేకపోలేదు. దీంతో పిఏసిఎ స్ చైర్పర్సన్ సీఈఓ లిఖితపూర్వ కంగా మండల తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. తమ సొసైటీకి చెందిన భూమిని తమ వద్ద ఉన్న మ్యాప్ ప్రకారం సర్వే జరిపి ప్రొసీడింగ్ పేపర్లు అప్పగించాలని వినతిపత్రంలో కోరారు. కేంద్ర ప్రభుత్వం వారి సహకారంతో భవనం నిర్మించుటకు ఆదేశాలు జారీచేసి ఉన్నారు. ఇలాంటి తరుణంలో భయపడకుండా ఒక సొసైటీ స్థలాన్ని ఆక్రమించినప్పటికీ గ్రామంలోని ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలో ఆక్రమణదారులు భయపడే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అందు కే ఏమాత్రం ఖాళీ స్థలం కనిపించిన ఆక్రమించి పాక వేస్తున్నారని వారు తెలపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమ ణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటే ఖాళీ స్థలమును కబ్జా చేసేందుకు వెనకడుగు వేస్తారని వారు అభిప్రా యాలు తెలిపారు. జిల్లాస్థాయి అధి కారుల స్పందించి పంచాయతీ, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్పర్సన్ తాంగుల మోహన్‌దాస్, మెంబర్లు వంతాల గాసన్న, సరస్వతి, రైతులు సత్తిబాబు, సురేష్, సీఈఓ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-అడ్డతీగల : అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా అన్ని వార్డులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆయన అన్నారు. ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది ఆయన ఆరా తీసి గర్భిణీ స్త్రీలకు ప్రతిరోజు ఆహారం ఏవిధంగా సరఫరా చేయుచున్నది ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం ఎన్ని జ్వరం కేసులు నమోదైనవి ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో స్కానింగ్ ఆపరేటర్ ఉన్నది లేనిది ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో పెట్టాలని ఆయన అన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అన్నారు. అనంతరం స్థానిక మండల పరిధి పరిషత్ ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ వారి వెంట రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. అంబేద్కర్, డిఎం & హెచ్ ఓ విశ్వేశ్వరనాయుడు, అడిషనల్ డిఎం & హెచ్ఓ డాక్టర్ డేవిడ్, డాక్టర్ శిరీష, తహసిల్దార్ ఎన్. దొరయాడి, ఎంపీడీవో రాజా విజయ, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి కృష్ణమోహన్, సిడిపిఓ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి సందర్శన

విశాలాంధ్ర-బలిజిపేట : జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి వై.విజయమోహన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు పీహెచ్‌సీలో జరుగుతున్న పీఎంఎస్ఎంఏ కార్యక్రమంనకు హాజరయ్యారు. గర్భిణీ లకు కొన్ని సూచనలు ఇచ్చారు. టీకాలు నిల్వ చేయు ఐఎల్ఆర్‌లు పరిశీలించి సలహాలు ఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర ప్రోగ్రాం లో భాగంగా ఎక్సటర్నల్ ఏసెస్మెంట్ చేసారు ఈ ప్రోగ్రాం లో వైద్య అధికారిని ఎం. మాధురి వైద్య సిబ్బంది పాలొగొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రతీఒక్కరూ అవగాహన చెందాలి

- ఎస్వీ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు మారథాన్ 5కె రెడ్ రన్ కార్యక్రమం నిర్వహణ : కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని ప్రతీ ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. హెచ్‌ఐవి/ఎయిడ్స్, మాదకద్రవ్య దుర్వినియోగం పట్ల యువతలో అవగాహన పెంపొందించేందుకు యూత్ ఫెస్ట్-2025 ఐఈసి మారథాన్ 5కె రెడ్ రన్ కార్యక్రమం మంగళవారం దిశ ఆధ్వర్యంలో జరిగింది. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించి, జెండా ఊపి 5కె రన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోగల శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ప్రారంభమైన రన్ 4 రోడ్ల జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు జరిగింది. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌ఐవి/ఎయిడ్స్ ప్రధానంగా రక్షణలేని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, వాడిన సిరంజీల వినియోగం ద్వారా వ్యాప్తి చెందుతుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండి జాగ్రత్తలు పాటించడం ద్వారా దీన్ని అరికట్టవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందరూ అలవరచుకోవాలని జిల్లా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.జిల్లాస్థాయిలో మూడు విభాగాల్లో (17-25 సం.ల మధ్య గల స్త్రీ, పురుషులు, ట్రాన్స్ జెండర్స్) జరిగిన ఈ పరుగు పందెంలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లా లెప్రోసి, ఎయిడ్స్, హెచ్.ఐ.వి మరియు టిబి నియంత్రణ అధికారి డా. మంతిని వినోద్ కుమార్ మాట్లాడుతూ యువతలో హెచ్ ఐ వి ఎయిడ్స్ వ్యాప్తి, ఇతర వ్యాధుల ప్రభావం పట్ల అవగాహన కల్పించడం కోసం మారథాన్ రన్, క్విజ్ కాంపిటీషన్, వివిధ ప్రాంతాల్లో ఐఈసి ప్రోగ్రామ్ లు కూడా జరుపుతున్నామని తెలిపారు. యువత చురుకుగా వీటిపై చర్చించి అవగాహన పెంచుకోవాలని కోరారు. మారథాన్‌లో పురుషుల విభాగంలో బి.సాయి ప్రథమ, ఎమ్. అజయ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. మహిళల విభాగంలో పి.అరుణ ప్రథమ, బి.స్పందన ద్వితీయ స్థానాలను సాధించారు. ట్రాన్స్‌జెండర్ విభాగంలో బి.చిన్ని ప్రథమ, బి.ప్రశాంత్ ద్వితీయ బహుమతి దక్కించుకున్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా రూ.7 వేల రూపాయలు మరియు క్విజ్ కాంపిటీషన్ విజేతలు ప్రథమ స్థానంలో ఎం.మౌనిక వైష్ణవి, బి. వాసు, ద్వితీయ స్థానంలో బి.భువనేశ్వరి, పి.కుమారి మరియు తృతీయ స్థానంలో పి.మమాలి, టి.భవ్యశ్రీలకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా నగదు బహుమతి మరియు సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ అధికారి డాక్టర్ మంతిని వినోద్ కుమార్,ఎఆర్టీ అధికారి డా.ఫణీంద్ర, దిశ సి.పి.ఎం కె.వి.ఆర్ శైలజ, డి.యస్.డి.ఓ. డా.శ్రీధర్, దిశ టీం జి.అమ్మినాయుడు, జి.కోటేశ్వరరావు, పిడి మంతిని వాసుదేవ రావు, శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ బలగ శాంతకుమారి, ఎన్‌సిసి కెప్టెన్ గుప్తా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం.ఎల్లంనాయుడు, కె శ్రీనివాసరావులు, అధ్యాపకులు కె.రోజా, కొత్తాడ శంకరరావు, ఎన్ సత్యనారాయణ, శంకరరావు, పాల్గున రావు,వెంకటరమణ, బి. తిరుపతిరావు, వైకుంఠ రావు, ఎం సౌజన్య, ఉమామల్లేశ్వరి, గౌరీ శంకర్రావు, టి కిషోర్‌కుమార్, నరేంద్ర, జగదీశ్వరరావు, హేమ సుందరరావు, డాక్టర్ శంకరరావు, గణేశ్ కుమార్, మాధవ నాయుడు, నవీన్ కుమార్లు, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రెడ్ రిబ్బన్ క్లబ్ విద్యార్థులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, ఎన్జీఓలు, ఎన్ఎసీపీ ఫెసిలిటీ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైకాపాకు లేదు : తెదేపా రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

విశాలాంధ్ర-చింతపల్లి : కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైకాపాకు లేదని తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎం వి వి ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైకాపా వల్లే మన్య ప్రాంత అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గణబాబు పత్రికా ప్రకటన ఇవ్వడం హాస్యాస్పద మన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అందించే సాధారణ పెన్షన్ ను 2 వేల రూపాయల నుంచి 3 వేల రూపాయలుగా అందిస్తామని హామీ ఇచ్చిన వైకాపాకు వెయ్యి రూపాయలు పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు. అటువంటి వైకాపాకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరిట ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచి 4 వేల రూపాయలు చేయడమే గాక వైకాపా ప్రభుత్వం లోని మూడు మాసాలతో కలిపి రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ పెన్షన్ లబ్ది దారునికి 7 వేల రూపాయలు చొప్పున అందించిన ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరిట ఇంటిలో ఒక్క విద్యార్థి కే నగదు జమ చేసేవారని, అటువంటిది చంద్రబాబు పాలనలో తల్లికి వందనం పేరిట ఇంటిలో ఎంతమంది చదువుకుంటే అంతమంది విద్యార్థులకు నగదు జమ చేసిన విషయాన్ని వైకాపా శ్రేణులు గమనించాలన్నారు. ఇచ్చిన అన్ని హామీలను ఏడాది కాలంలోనే అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నగదు జమ చేస్తున్నామంటూ అభివృద్ధి, సంక్షేమాలను గాలికి వదిలేసిన వైకాపా నేడు కూటమి ప్రభుత్వం పై అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెదేపా ప్రభుత్వం లో జరుగుతున్న అభివృద్ధిని తమ కృషి ఫలితమని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. అంజలి శనివారం ప్రధాన రహదారి నిర్మాణం కోసం కృషి చేయడంతో పాటు నేడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో ఆ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేస్తే ఆ రహదారి నిర్మాణాన్ని వైకాపా నాయకులు తమ కృషి ఫలితమని ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. నాడు వైకాపా మానిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చామని, ఊక దంపుడు ఉపన్యాసాలు చేసిన వైకాపా నాయకులు, ఒక్కసారి ఆ మ్యానిఫెస్టోని చదివి ఆత్మావలోకనం చేసుకోవాలన్నారు. ఆటాడుదాం, పాటు పాడుదామంటూ అర్థం లేని పథకాలను రూపొందించి అవకాశం ఉన్న మేరకు దోచుకున్న ప్రభుత్వం వైకాపా అన్నారు. దోచుకున్న సొమ్ముతో ఏవిధంగా నైనా మరల అధికారంలోకి రావచ్చనే నియంతృత్వ ఆలోచనతో వై నాట్ వన్ సెవెంటీ ఫైవ్ అనే నినాదంతో ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేసినప్పటికీ, విజ్ఞులైన ప్రజలు వీటన్నింటినీ గమనించి సార్వత్రిక ఎన్నికలలో కనీసం ప్రతిపక్ష హోదా లేకుండా తీర్పు విషయాన్ని వైకాపా గుర్తెరిగి ఆరోపణలు చేయాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

అన్నదాతకు అండగా ఉండేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీయే

విజయవంతమైన అన్నదాత పోరు కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: అన్నదాతకు అండగా ఉండేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యేనని ఆ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు గానీ, వ్యవసాయ మంత్రిగా అచ్చెన్నాయుడుకు గానీ ఏ మాత్రం చీమకుట్టినట్లయినా లేదన్నారు. రైతులు క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన అచ్చెన్నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగేందుకు అర్హుడేనా అని ప్రశ్నించారు. రైతులకు ఎరువులు అందించడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. యూరియా బస్తాలు బస్తాలుగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోతుంటే కళ్ళు మూసుకున్నారన్నారు ఎరువులు దొరక్క రైతు పంటను పాడు చేసుకోవాల్సిన దుస్థితి రావడం చంద్రబాబు పాలనలో జరిగిన ఘోర వైఫల్యం అన్నారు.రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తివేశారనీ మేం క్రమం తప్పకుండా ఇస్తున్న రైతు భరోసాను ఎత్తివేసి, పీఎం కిసాన్తో సంబంధం లేకుండా రైతులకు పెట్టుబడి సహాయం కింద ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పేరుతో ఇస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చి. వెన్నుపోటు పొడిచారన్నారు.రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. యూరియా సహా ఎరువుల కొరత లేకుండా చూడాలి. రైతుల చెంతకే వాటిని చేర్చాలి. బ్లాక్ మార్కెట్ ను నియంత్రించాలి. ఎరువులను పక్కదోవ పట్టలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. సహా పంటలకు గిట్టుబాటు ధర అందించాలి. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింపజేయాలనీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు పరీక్షిత్ రాజు, మాజీ మంత్రులు రాజన్న దొర, పుష్ప శ్రీవాణి, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీస్వరి, ఎంపీపీలు మజ్జి శోభారాణి, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, పట్టణ మండలాల పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పాలవలస మురళీకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిలు పోల సత్యనారాయణ, తప్పిటా ప్రసాద్, అధికార ప్రతినిధి ముప్వల సత్యం నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు రంగుముద్రి గణపతిరావు, జిల్లా పార్టీ ప్రతినిధులు, వివిధ నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్న పోలీసులు

విశాలాంధ్ర-సీతానగరం : మంగళవారం నాడు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో యూరియా కొరతపై వైసీపీ ధర్నా చేసిన నేపథ్యంలో ఎంపీపీ బలగ శ్రీరాములు నాయుడు, జడ్పిటిసి మామిడి బాబ్జి, పలువురు వైసీపీ నాయకులను ముందస్తుగా వారి ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. సుమారు మూడు గంటల పాటు వారిని అదుపులో ఉంచి పార్వతీపురంలో కార్యక్రమం పూర్తయిన తర్వాత విడిచిపెట్టినట్లు తెలిపారు. రైతులకు సరిపడా ఎరువులను అందజేయాలి తప్ప ఇటువంటి ముందస్తు అరెస్టులు చేసి నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

వైసీపీకి స్టేట్ బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ బత్తుల సత్యనారాయణ రాజీనామా

విశాలాంధ్ర-అడ్డతీగల : వైసిపి సీనియర్ నాయకుడు రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల మండలం రాయ పల్లి గ్రామానికి చెందిన బత్తుల. సత్యనారాయణ వైసీపీకి మంగళవారం రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ అనంత. ఉదయ భాస్కర్ మరియు వైసీపీ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే నాగులంపల్లి, ధనలక్ష్మికి రాజీనామా పత్రాన్ని అందజేసినట్లు బత్తుల తెలిపారు. గత 25 సంవత్సరాలుగా అనంత. ఉదయ భాస్కర్‌కు అనుచరుడుగా ఉంటూ, 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ బీసీ సెల్ కోఆర్డినేటర్‌గా 2014 నుండి వైఎస్ఆర్సిపి బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా 2022 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వివిధ పదవుల్లో బత్తుల. సత్యనారాయణ పనిచేశారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలురీత్యా తన వ్యక్తిగత కారణాల వలన,వైసీపీ స్టేట్ బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, రాజీనామా చేస్తున్నట్లు బత్తుల. సత్యనారాయణ తెలిపారు. ఇంతవరకు తనను వివిధ పదవులలో కొనసాగించిన ఎమ్మెల్సీ అనంత. ఉదయ భాస్కర్‌కి మాజీ ఎమ్మెల్యే నాగులంపల్లి ధనలక్ష్మికి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రధాన దారుల్లో పశువులు... పురవీధుల్లో కుక్కలు

- ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా సంచరించే గోవులను గోశాలలకు తరలించండి
- వీధి కుక్కల నుంచి పాదాచారులకు రక్షణ కల్పించండి : స్థానికుల అభ్యర్థన

విశాలాంధ్ర-చింతపల్లి : మూగజీవాలను మురిపెంగా చూసుకునే పశు యజమానులు, శునక ప్రియులు వాటి ఆలనా పాలనా చూసుకోవడంలో మాత్రం అశ్రద్ధ వహిస్తున్నారు. దీంతో విచ్చలవిడిగా తిరిగే వీటి వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పశువులను పోషించుకోవలసిన పశు యజమానులు ఆవులు, గేదెలను పాల కోసం ఇంటికి తోలుకొని వెళ్లి పాలు పిండుకున్న వెంటనే విచ్చలవిడిగా వదిలివేయడంతో అవి రోడ్లపైనే తిరుగుతూ కూరగాయలు, ఆకు కూరలు, గోడ పత్రికలు తినేందుకు అలవాటు పడి రేయనక పగలనక రహదారుల పైనే సేద తీరుతున్నాయి. ప్రధాన రహదారులపై ప్రయాణించే వాహనాలకు వీటి వలన ఇబ్బందులు కలుగుతున్నప్పటికీ పశువులను వాటి యజమానులు కేవలం పాలు తీసుకునే సమయంలో మాత్రమే ఇంటికి తోలుకు వెళ్తున్నారు. అదే ఎద్దులు, దున్నపోతులు అయితే వ్యవసాయ అదనులో మాత్రమే రైతులు కట్టేసి, పనులు పూర్తి అయిన తర్వాత విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. ఈ పశువుల వలన అనేక రహదారి ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. అదే క్రమంలో పశువులు కూడా ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడిన సందర్భాలు అనేకం. అదే క్రమంలో పురవీధులలో శునకాల బెడద విపరీతంగా ఉంది. శునకాలను పెంచుకునే శునక ప్రియులు వాటిని బంధించకుండా ఉండడం వలన ఆ రహదారుల గుండా వెళ్లే పాదాచారులను కాటు వేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటి కాటు వలన మరణాలు సంభవించే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే మన్యంలో ఆరోగ్య శాఖకు చెందిన యువతి కుక్క కాటు వలన ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి పాఠకులకు విధితమే. ఇదే క్రమంలో సాయి నగర్ వీధి సహా ఇతర పలు వీధులలోనూ, మాంసం దుకాణాల చెంత కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. వీటిని నియంత్రించవలసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై విచ్చలవిడిగా సంచరించే పశువులను గోశాలలకు తరలించడంతోపాటు ప్రమాద భరితంగా ఉన్న శునకాలను(కుక్కలను) జంతు శాలలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

దోమల వలనే జ్వరాలు : కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మండలం కింద్ర, లబ్బర్తి, లాగరాయి గ్రామాలలో కీళ్ల వాపులు మోకాళ్ళ నొప్పులతో అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నారంటూ పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన ప్రభుత్యాధికారులు మూడు గ్రామాలలో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి వైద్య బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నారు,జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాలలో పర్యటించి,పరిసరాలు అశుభ్రంగా ఉండి, దోమలు పెరగడం వలనే ఈ వ్యాధులు వస్తున్నాయని,ఇప్పటికే రెండు చికెన్ గున్య కేసులు నమోదైయ్యాయని తెలిపారు,ఈ జ్వరాలకు ఎవరు బయపడవద్దని,దీనికి సంబందంచిన మందులు ప్రభుత్య హాస్పటల్లో సిద్దంగా ఉన్నాయని తెలిపారు,వాపులు కీళ్ల నొప్పులతోబాధపడుతున్న వారి వ్యాధి లక్షణాలను బట్టి వారికి వైద్య సేవలు అందించి అవగాహన కల్పించాలని డిఎంహెచ్వో విశ్వేశ్వరనాయుడు,ఏడిఎం అండ్ హెచ్ ఓ డేవిడ్, డాక్టర్ శిరీషలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. లాగరాయి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది పనితీరును, రికార్డులను,పరిసరాలను పరిశీలించారు, పంచాయతీలలో పారిశుధ్యం లోపించినట్లు గుర్తించడం జరిగిందని పారిశుధ్యం పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవంటూ పంచాయతీ సెక్రటరీ, డిఎల్‌పిఓ, ఎంపీడీవో, సర్పంచులను పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల రోగాల బారిన పడకుండా కాపడవలసిన బాధ్యత తమదేమంటూ వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, తహసిల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, సిఐ గౌరీ శంకర్, ఎంఈఓ2 సూరయ్య రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి చక్రధర్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లోత లక్ష్మణరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు సర్పంచులు రమణి, ఘనలక్ష్మి, సత్యవతి, సత్యనారాయణ వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని కలిసిన బికే మూర్తి

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ.ప్రసాదరావును మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రటరీ భాసూరు కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

రైతులు సాగు ఖర్చు తగ్గిస్తూ అదనపు ఆదాయం పొందాలి

సహాయ వ్యవసాయ సంచాలకులు సాలూరు సత్యవతి

విశాలాంధ్ర-పాచిపెంట : రైతులు విచక్షణ రహితంగా రసాయనాలు వాడకుండా దిగుబడి పెంచడమే కాకుండా సాగు ఖర్చులను కూడా తగ్గిస్తూ భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ అంతర పంటలు గట్లు మీద కంది విత్తనాలు ద్వారా అదనపు ఆదాయాన్ని పొందే విధంగా ఆలోచించాలని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యవతి అన్నారు. పి కొనవలస గ్రామంలో పొలం పిలుస్తోంది అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు అనవసరంగా డుబ్బు గుళికలు వంటి వాటిపై అదనపు ఖర్చులు పెడుతున్నారని వ్యవసాయ శాఖ సూచనలు తీసుకుని సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు .అనంతరం పనుకోవలస విశ్వనాధపురం రైతులకు యూరియా పంపిణీ పరిశీలించి విచక్షణ రహితంగా యూరియాను వాడొద్దని ప్రస్తుత సాగు అవసరాలకు సరిపడా యూరియాను మాత్రమే రైతులకు తీసుకుని వెళ్లాలని తదుపరి దఫా కోసం మరల ఎరువులు వస్తాయని ఆందోళన పడవద్దని తెలిపారు. అనంతరం ప్రకృతి సేద్య సిఆర్పి విజయ్ ఆధ్వర్యంలో బొబ్బిలి వలస లో ప్రకృతి సేద్య రైతు మృత్యుంజయరావు తయారుచేసిన 600 లీటర్ల ఘనజీవామృతం తయారీలో పాల్గొన్నారు .ఘన ద్రవ జీవామృతల తయారీ ద్వారా రసాయన ఎరువులు పై భారం తగ్గించవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రకృతి సేద్య అధికారులు పాల్గొన్నారు.

పాములాయిలో ఆగిపోయిన రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలి
- యువ నాయకుడు దామోదర్

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : ఆగిపోయిన రోడ్డును మళ్లీ పనులు ప్రారంభించాలని పోతంగి పంచాయితీ యువ నాయకుడు దామోదర్ డిమాండ్ చేశారు. మండలంలోని పోతంగి పంచాయితీ పాములాయి గ్రామంలో ఆయన సందర్శించి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాములాయ్ గ్రామంలో ఆగిపోయిన రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములాయ్ గ్రామంలో రోడ్డు పనులు మధ్యలోనే ఆపడం వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరైన రోడ్డు సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోలేక పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం అభివృద్ధి చెందాలన్న కేవలం రోడ్డు సౌకర్యం ఉంటే అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు గ్రామానికి అందుతాయని చెప్పారు. వర్షాకాలంలో సరైన రోడ్డు సౌకర్యం లేకపోతే గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులకు ఎటువంటి జబ్బు జ్వరాలు వచ్చిన రోడ్డు సౌకర్యం లేకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నిలిచిపోయిన రోడ్డు పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

రేషన్ స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమలుపరుస్తున్న రేసన్ స్మార్ట్ కార్డులను రేషన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంబారి సత్యవతి అన్నారు. పెద బరడ పంచాయతీలో మంగళవారం తెదేపా యూనిట్ ఇంచార్జ్ గెమ్మెల రమణ ఆధ్వర్యంలో వేసము స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి సూచనలతో పెద బరడ పంచాయతీ లో రేషన్ స్మార్ట్ కార్డు లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రేషన్ లబ్ధిదారులంతా ఈ కార్డులను సద్వినియోగం చేసుకొని డి ఆర్ డిపోల ద్వారా నిత్యవసర సరుకులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా బూత్ ఇన్చార్జి పిండి రమణ, సీనియర్ నాయకుడు నంబారి రాజబాబు, ఇతర నాయకులు, అధిక సంఖ్యలో రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించి పంపిణీ చేస్తున్న రేషన్ స్మార్ట్ కార్డులను రేషన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బలపం సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు అన్నారు. పంచాయతీ పరిధిలోని 33 గ్రామాల రేషన్ లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డ్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ స్మార్ట్ కార్డులను రేషన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు లింగరావు, సచివాలయ ఉద్యోగులు జమన, రామారావు, పెసా కమిటీ సభ్యులు రంగారావు, వెంకట్, కూటమి నాయకులు జి.అప్పారావు, గ్రామస్తులు మోహన్, లక్ష్మణ్, నీలకంఠం, బాలు, అధిక సంఖ్యలో రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టి. విశ్వేశ్వరనాయుడు హెచ్చరిక

విశాలాంధ్ర-కొయ్యూరు : ప్రస్తుత కాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ గా ప్రబలే వ్యాధుల పట్ల, ప్రసవ సమయంలో గర్భిణీ స్త్రీలను సకాలంలో పిహెచ్‌సికి తరలించే క్రమంలో వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏ ప్రాంతంలోనైనా నిర్లక్ష్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవటం తప్పదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టి.విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోనీ రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ వో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో రోగులకు అందించే చికిత్స, సిబ్బంది పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది ఏరియా వారీగా పనిచేసే రిజిస్టర్ ను తనిఖీ చేసారు. పిహెచ్‌సిలో రోగులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్‌సి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ వైద్య సిబ్బంది తమ విధులు పట్ల నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.ఈ క్లస్టర్ పరిధిలో నుండీ వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. రానున్న రెండు నెలలు వర్షాకాలం కానున్నందున సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సర్విస్ చేయాలని ఆదేశించారు. ఏ ప్రాంతం నుండీ పిర్యాదు లొచ్చినా సహించేది లేదన్నారు. పిహెచ్‌సి వైద్యధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ తో సిబ్బంది దాదాపు పాల్గొన్నగా, వైధ్యాధికార్లు హేమంత్, స్నేహలత, సిహెచ్‌ఓ ప్రశాంత్‌కుమార్, ఏఎన్ఎంలు, హెల్త్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో అధికారుల ముఖాముఖి

- యూరియా అందిందా... ఇబ్బంది ఉందా...?
- మండల ప్రత్యేక అధికారిని సుధారాణి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎరువులు సక్రమంగా అందాయా...లేదా అన్న దానిపై మండల ప్రత్యేక అధికారిని ఎం సుధారాణి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఆమె మంగళవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. మండలంలో ని తాళ్ల బురిడి, వెంకంపేట గ్రామ రైతులతో మాట్లాడి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూరియా సక్రమంగా అందిందా ఎవరైనా ఎరువులను అధిక రేట్లకు విక్రయిస్తున్నారా యూరియా అందకుండా ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారా అన్నదానిపై ఆరా తీశారు. కొంతవరకు యూరియా ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని, అయితే భూములు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఒక్క రైతుకు ఆధార్ కార్డును బట్టి, విస్తరణను బట్టి ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇవ్వడం అందుకుగాను సమయం అధికంగా వృధా అవుతుందని రైతులు అధికారుల ముందు వాపోయారు. వరి సాగుకు ఎప్పటినుంచో యూరియా వాడడం ఆనవాయితీగా వస్తుందని, ఇప్పుడేమో పూర్తిస్థాయిలో యూరియా దొరక్క కాస్త ఇబ్బంది పడుతున్నామని కొందరు రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మండల పరిధిలో ఇప్పటివరకు వివిధ గ్రామాలకు ప్రభుత్వం పంపిణీ చేసిన యూరియా యొక్క పూర్తి వివరాలు, రైతులు వివరాలను ఏవో అశోక్ వెల్లడించారు. ఈ ముఖాముఖిలో ఆమెతోపాటు తాసిల్దార్ సురేష్ ,వ్యవసాయ అధికారులు, గ్రామస్తులు ,సర్పంచ్, రైతులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మండల పిసా అధ్యక్షులు

విశాలాంధ్ర-జి. మాడుగుల : మండల పిసా అధ్యక్షులు లకే రామకృష్ణ ఆధ్వర్యంలో పాడేరులో జిల్లా కలెక్టర్‌ను కలిసినట్లు మండల పిసా అధ్యక్షులు రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూసిపల్లి గ్రామంలో స్కూల్ బిల్డింగు. మరియు సీసీరోడ్డు మంజూరు చేయాలని కలెక్టర్ వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం క్లస్టర్ పెసా ఉపా ధ్యక్షులు వంతల లక్ష్మణ్ రావుకృష్ణాపురం క్లస్టర్ పెసా కార్యదర్శి టి. పోతురాజు గ్రామస్తులు, కొర్ర నాగేశ్వరావు, కిల్లో అర్జున్ పి.ధనర్జన్ పి.శివాజీ పి.గోపినాథ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
బుధవారం 10, సెప్టెంబరు 2025

ఘనంగా శ్రీపైడిమారమ్మ వారాల పండుగ

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం మేజర్ పంచాయతీ ప్రజలు ఇలవేల్పు ,కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు శ్రీ పైడిమారమ్మ అమ్మ వారి వారాల పండుగ రైతులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నాయుడు వీధిలో అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకొని మేళతాళాలతో ఊరేగింపుగా రైతులకు వనంగుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి అందరూ బాగుండాలని ,వంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

దుచ్చరపాలెంలో ఆదికర్మ యువజన కార్యక్రమం

విశాలాంధ్ర-జీకే వీధి : రింతాడ పంచాయతీ సచివాలయం 2 దుచ్చర పాలెంలో ఆదికర్మ యోజన కార్యక్రమంలో భాగంగా ఏబులం,పెదపాడు పారికల గ్రామాలు ప్రజల ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ మడపాల సోమేష్ కుమార్, కార్యదర్శి అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కార్యక్రమంలో మండల పీసా కార్యదర్శి గబులంగి గణేష్ మాట్లాడుతూ ఏబులంలో అనేక సమస్యలు ఉన్నాయని ప్రధానంగా డ్రైనేజ్,మినీ అంగన్వాడి, పంట కాలువ డ్రైనేజ్, కమ్యూనిటీ హాల్,మినీ గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు పై అధికారులను తెలియజేయడం జరిగిందన్నారు.దుచ్చరపాలెంలో సీసీ రోడ్లు,జీసిసి ద్వారా డిపో,కమ్యూనిటీ భవనం ఏర్పాటు,చెక్ డాం పూడికతీత చేయాలని చేయాలని, గ్రామాలలోని పలు సమస్యలను ఆదికర్మ యోజన కార్యక్రమంలో పలువురు రైతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ సాగిన జోగి పడాల్,పిసా కమిటీ అధ్యక్షులు సాగిన భీమేశ్వర్ పడాల్,కూటమి నాయకులు మార్కెట్ యాడ్ చైర్మన్ మొట్టడం శరబన్న దొర, జనసేన నాయకులు సాగిన బ్రహ్మ చేవదాల్,అనిల్, వంద్రంగి సత్యనారాయణ, స్కూల్ చైర్మన్ ఖఘుపతి, రమేష్ సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సై సురేష్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి పోలీస్ స్టేషన్ కి నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్గా నియమితులైన కె సురేష్ ను జిల్లా బిజెపి నాయకులు స్థానిక ఎంపీటీసీ రిమల రాజేశ్వరి, జీకే విధి బిజెపి మండల అధ్యక్షులు కే శేఖర్. జిల్లా బిజెపి వైస్ ప్రెసిడెంట బోండ్ల చిరంజీవి, రీమల పాల్, పోలీస్ స్టేషన్లో మర్యాద పూర్వకంగా కలిసి దుస్సాల్వతో సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే గూడెం కొత్త వీధి మండలం కు సంబంధించిన పలు విషయాల గూర్చి చర్చించడం జరిగిందిని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా విత్తనాలు ఇవ్వాలి

- పురుగు మందులు బలవంతంగా అంట గట్టవద్దు
- పుచ్చిన విత్తనాలు సరఫరా చేయటం సరికాదు
- సీపీఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ధనుంజయ్

విశాలాంధ్ర-చింతపల్లి : కూటమి ప్రభుత్వం రైతులకు సరిపడా విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేయాలని సిపిఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనంజయ్ అన్నారు. మండలంలోని తాజంగి సచివాలయం పరిధి రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం జరుగుతున్న రాజ్మా చిక్కుళ్ళ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్నీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడిన రైతులు 5 కేజీల రాజ్మా విత్తనాలు ఇస్తున్నారని, అవి ఎటూ సరిపోవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు చెడిపోయిన విత్తనాలు ఇస్తున్నారని, అవి మొలకొచ్చి పాడై పోయినవని చూపించారన్నారు. ఇది కాక పురుగు మందులు అదనంగా బలవంతంగా అంట గడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో పొడు వ్యవసాయంలో అవి చల్లుతారని, ఈ ప్రాంత రైతులు ఎవరు పురుగు మందులు వాడరని, అటువంటి ఈ ప్రాంతంలో పాడైన విత్అతనాలను రైతులకు ఎందుకు అంటగట్టి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందని ప్రజలు నమ్మితే,.రైతులకు నాసిరకం విత్తనాలు పంచుతూ డబ్బులు తీసుకుని మోసం చేస్తుందని మండిపడ్డారు. ఇది కాకుండా పంట పొలాలకు ఎరువులు వేసే దశకు వచ్చినా రైతు సేవా కేంద్రాల్లో నేటికి ఎరువులు పంపిణీ చెయ్యలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రైతులకు సరిపడా నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులు పంపిణీ చేయాలని లేని పక్షంలో రైతుల నుండి తీసుకున్న డబ్బులు రైతులకు ఇచ్చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు సీసా ప్రభాకర్, పిట్టల పోతురాజు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

రైతులకు సూచించిన కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ-పార్వతీపురం : ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులు అవగాహన పెంచుకోవాలని, అలాగే వీలైనంత వరకు సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రైతులకు పిలుపునిచ్చారు. కురుపాం మండలంలోని ఉదయపురం గ్రామాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. అక్కడి రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అధిక మోతాదులో ఎరువుల వినియోగం వలన పంటకు, ఆరోగ్యానికి హానికరమని అన్నారు. కావున నిర్దేశించిన మోతాదులోనే యూరియాను వినియోగించాలని, ఈ విషయాన్ని రైతులు గ్రహించాలని సూచించారు. అధిక యూరియా వినియోగానికి బదులుగా నానో మరియు ఇతర జీవన ఎరువులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. నానో యూరియా, డిఏపిని వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. నానో యూరియా, డిఏపి అందరికీ అందుబాటులో ఉన్నాయని, అవసరం మేరకు వాటిని వినియోగించాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా నానో యూరియా, డిఏపిని రైతులకు కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థినులతో ముచ్చటించారు. కాసేపు అధ్యాపకుడుగా మారి విద్యార్థులకు పాఠ్యంశాలను బోధించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని అధ్యాపకులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతులు లోటు ఉండరాదని, ఎల్లవేళలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అక్కడి నుండి గుమ్మా గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన రోగులకు కాల్షియమ్, ఇతర టాబ్లెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. తదుపరి మొండెంకల్లులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, మందులను పరిశీలించి, రోగులకు మంచి సేవలు అందించాలని వైద్యులను కోరారు. తదుపరి ఆ గ్రామంలోని చెరువును పరిశీలించి ఆర్.ఆర్.ఆర్ కింద జంగిల్ క్లియరెన్స్ చేసి, ఆదర్శవంతమైన చెరువుగా దీన్ని తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కురుపాంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు తోయక జగదీశ్వరితో కలిసి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు. ఈపర్యటనలో జిల్లా లెప్రోసి, ఎయిడ్స్, హెచ్.ఐ.వి మరియు టిబి నియంత్రణ అధికారి డా. ఎం.వినోద్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మచంద్రా రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.జగదీశ్వర రావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రోగ్రాం మేనేజర్ శ్రావణ్ కుమార్,ఇతర వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో చంద్రబాబు షూరిటీ-మోసం గ్యారంటీ

విశాలాంధ్ర-చింతూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ పిలుపుమేరకు ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎండగడుతూ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన" చంద్రబాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం నియోజవర్గం చింతూరు మండలం చింతూరు (ఎర్రంపేట) మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గౌరవ ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలను మోసం చేసిందని అందుకే వారి తరపున వారి ప్రజలు గొంతుకై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు, అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల వద్దకు పాలన తీసుకురావడం కోసం జగన్మోహన్ రెడ్డి నూతన సంస్కరణలు తీసుకొస్తే చంద్రబాబు నాయుడు వాటిని ధ్వంసం చేసేందుకు వ్యూహరచన చేస్తున్నారన్నారు. ఎలక్షన్లలో హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కూటమి పార్టీ ఈరోజు వాటిలో అమలు చేయడంలో కాకమ్మ కథలు చెబుతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు బనాయించేందుకు శ్రద్ధ చూపిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల పార్టీ అధ్యక్షులు, విఆర్ పురం మండల పార్టీ అధ్యక్షులు, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడు, చింతూరు జడ్పిటిసి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఎంపిటిసిలు, సర్పంచులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతులతో అధికారుల ముఖాముఖి

- యూరియా అందిందా... ఇబ్బంది ఉందా...? -మండల ప్రత్యేక అధికారిని సుధారాణి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎరువులు సక్రమంగా అందాయా...లేదా అన్న దానిపై మండల ప్రత్యేక అధికారిని ఎం. సుధారాణి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఆమె మంగళవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. మండలంలోని తాళ్ల బురిడి, వెంకంపేట గ్రామ రైతులతో మాట్లాడి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూరియా సక్రమంగా అందిందా ఎవరైనా ఎరువులను అధిక రేట్లకు విక్రయిస్తున్నారా యూరియా అందకుండా ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారా అన్నదానిపై ఆరా తీశారు. కొంతవరకు యూరియా ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని, అయితే భూములు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఒక్క రైతుకు ఆధార్ కార్డును బట్టి, విస్తరణను బట్టి ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇవ్వడం అందుకుగాను సమయం అధికంగా వృధా అవుతుందని రైతులు అధికారుల ముందు వాపోయారు. వరి సాగుకు ఎప్పటినుంచో యూరియా వాడడం ఆనవాయితీగా వస్తుందని, ఇప్పుడేమో పూర్తిస్థాయిలో యూరియా దొరక్క కాస్త ఇబ్బంది పడుతున్నామని కొందరు రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మండల పరిధిలో ఇప్పటివరకు వివిధ గ్రామాలకు ప్రభుత్వం పంపిణీ చేసిన యూరియా యొక్క పూర్తి వివరాలు, రైతులు వివరాలను ఎఓ అశోక్ వెల్లడించారు. ఈ ముఖాముఖిలో ఆమెతోపాటు తహసిల్దార్ సురేష్, వ్యవసాయ అధికారులు, గ్రామస్తులు, సర్పంచ్, రైతులు ఉన్నారు.

రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

లంబసింగి సర్పంచ్ శాంతికుమారి

విశాలాంధ్ర-చింతపల్లి: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకుని దాని సాగుతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని లంబసింగి సర్పంచ్ కొర్ర శాంతి కుమారి అన్నారు. మండలంలోని ఆంధ్ర కశ్మీర్ లంబసింగి పంచాయతీలో రాజ్మా (కిడ్నీ బీన్స్) విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాజీ సర్పంచ్ రఘునాథ్, కూటమి పార్టీలకు చెందిన నాయకులతో కలిసి ముందుగా ప్రభుత్వం రైతులకు రాయితీపై సరఫరా చేసిన రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మన్య ప్రాంతంలో శీతల వాతావరణానికి అనువైన పంట రాజ్మా అన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే రాజ్మా సాగును మన్య ప్రాంతంలో మరింత విస్తృతపరచవలసిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకుని సాగు చేపట్టాలని రైతులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు కిముదు లక్ష్మయ్య, ఐ టి డి పి అధ్యక్షుడు వీ. మహేంద్ర, పీసా కమిటీ మండల కన్వీనర్ వెంకట నాగరాజు(బుజ్జి), మాజీ ఎంపీటీసీ దేపూరి గిరిబాబు, లోచల ప్రసాద్, శ్రీను, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, వైకాపా శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న పెసా కమిటి ఉపాధ్యక్షుడు లకే రామక్రిష్ణ

పెసా కమిటీ మండల అధ్యక్షులు ఐసారం హనుమంతురావు ఆరోపణ

విశాలాంధ్ర-జి .మాడుగుల : మండలం సొలబం పంచాయతీ, వంజంగిపాడు క్లస్టర్ పెసా కమిటి ఉపాధ్యక్షుడు లకే రామక్రిష్ణ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని, జి.మాడుగుల పెసా కమిటీ మండల అధ్యక్షులు ఐసారం హనుమంతురావు ఆరోపించారు. జిమాడుగుల మండలంలో 17 పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా నూతనంగా ఎన్నుకోబడిన మండల పెసా కమిటీ అధ్యక్షులు హనుమంతరావు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సొలబం పంచాయతీ వంజంగిపాడు క్లస్టర్ పెసా ఉపాధ్యక్షుడు అయినా లకే రామకృష్ణ మండల పెసా అధ్యక్షుడు అని చెప్పుకుంటూ గ్రామపంచాయతీలలో సర్పంచ్‌ల అనుమతి లేకుండా అన్ని సచివాలయలలో రికార్డులు పరిశీలిస్తూ, స్కూల్లకు హెల్త్ సెంటర్లకు అంగన్వాడి సెంటర్లకు, వెళ్లి అనధికారిక పరిశీలన చేస్తూ సచివాలయ సిబ్బందిని ఫోన్ ల ద్వారా భయభ్రాంతులకు గురి చేస్తు సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నాడని, సర్పంచ్‌ల అధికారాలను దుర్వినియోగం చేస్తూ, సర్పంచ్ లను అగౌరవపరుస్తున్నాడని అన్నారు. గతంలో కస్తూర్బా పాఠశాల లోపనిచేస్తున్న అదనపు అధికారిని బెదిరిస్తూ సర్పంచులు ఎంపీటీసీలు పేర్లు చెప్పి లక్ష రూపాయలు ఇస్తేనే గాని కుదరదని చెప్పి ఆమెను బ్లాక్మెయిల్ చేసి భయభ్రాంతులకు గురిచేసడనీ, ఆ మహిళ అధికారిని పోలీస్ స్టేషన్ లో గతంలో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. పెసా కమిటీ అధ్యక్షుడిగా పేరు చెప్పుకుంటున్న లక్కే రామకృష్ణ గతంలో సొలంబం పంచాయతీలో విఆర్పీగా పనిచేస్తూ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ డబ్బులు కోట్ల రూపాయలు కొల్లగొట్టి కోర్ట్ చుట్టూ తిరుగుతున్నాడన్నారు. మండలంలో 17 పంచాయతీలలో తిరుగుతూ సిసి రోడ్లు, డ్రైనేజీలు, మట్టి రోడ్లు, తారు రోడ్లు, స్కూల్ భవనాలు అంగన్వాడి సెంటర్లు కట్టిస్తానని అమాయక గిరిజనులు నమ్మించి వారిని మోసం చేస్తున్నాడని అన్నారు. సర్పంచులను అధికారులను అగౌరవపరుస్తూ క్లస్టర్ ఇన్చార్జి అయిన మండల పెస కమిటీ అధ్యక్షుడిగా చెప్పుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న లకే రామకృష్ణ పై తగ చర్యలు తీసుకోవాలని జిమాడుగుల మండల రెవెన్యూ అధికారికి, మండల ఎంపీడీవో. కి. స్థానిక ఎంపీపీ అప్పలరాజు వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పలాస కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షులు తల్లే సూరిబాబు, సర్పంచ్‌లు కె.రాంబాబు, ఎస్ రామకృష్ణ, ఎం గంగరాజు, బాలన్న, ఎస్ కొండబాబు, కే రమణి, జేఎస్ బాలన్న, కే బుజ్జిబాబు, చిన్న కుమారి, ఎం.రాజులమ్మ, ఎల్ మల్లన్న, వి కృష్ణమూర్తి, జి పద్మ, ఎం చిలకమ్మ, కే అప్పలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్సీపి ఆధ్వర్యంలో ఎరువుల కోసం అన్నదాత పోరుబాట

విశాలాంధ్ర-పాలకొండ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నదాత కోసం ఎరువుల కోసం పోరుబాట పాలకొండ,కురుపాం, నియోజకవర్గాల స్థాయి మహా ధర్నా కార్యక్రమం మంగళవారం స్థానిక కార్గిల్ జంక్షన్ నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు మహా ధర్నా కార్యక్రమం వైయస్సార్సీపి అగ్ర నాయకులు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పూర్వపు శాసనసభ్యులు విశ్వాసరాయి కళావతి పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు అడుగడుగున కూటమి ప్రభుత్వం పోలీసులు ద్వారా ఆటంకాలు పరిచిన అధిగమించి అన్నదాత కోసం అన్నదాతకు ఎరువులు సక్రమంగా అందేందుకోసం జయప్రదంగా నిర్వహించారు ముందుగా ధర్నా కార్యక్రమం అనంతరము స్థానిక ఆర్డిఓ పరిపాలన అధికారికి ఎరువుల సరఫరా పై వినతి పత్రాన్ని సమర్పించారు అనంతరము స్థానిక విలేకరులతో ఎమ్మెల్సీ విక్రాంత్ మాజీ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి కళావతి మాట్లాడుతూ రైతులకు ఎరువులు సరఫరా పై కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని నల్లబచారులో ఎరువులను తరలించి అధిక ధరలకు అమ్మే విధంగా కూటమి ప్రభుత్వం సహకరిస్తుందని ఎద్దేవ చేశారు ఏ ప్రైవేటు ఎరువుల దుకాణం దగ్గర చూసినా బారులు తీరిన రైతులను చూస్తే జాలేస్తుందని మా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పంటల సీజన్లో ముందు చూపుతో ఎరువులను రైతులకు సక్రమంగా అందే విధంగా చర్యలు చేపట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు,చంద్రబాబు నాయుడు రైతు వ్యతిరేకిగా గతంలో కూడా ముద్ర పడి ఉన్నారని నేడు రైతులకు ఎరువులు లేకుండా పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించి రైతు నడ్డి విరిచే విధంగా కూటమి ప్రభుత్వం అవలంబిస్తుందని అన్నారు, రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నిలువునా మోసం చేశారని అన్నారు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు యుద్ధ ప్రాతిపదికన రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు 15 నెలలలోనే కూటమి ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని అన్నారు సూపర్ సిక్స్ అమలు చేయలేక ఆంధ్రప్రదేశ్ ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే తిరుగుబాటు జెండాను ఎగరవేశారని ఈ ప్రభుత్వానికి ఘోరీ కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు ఈ పోరుబాటలో వైసిపి నాయకులు దమలపాటి వెంకటరమణ జడ్పిటిసి కన్నతల్లి,కనపాక సూర్య ప్రకాష్ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు పాలవలస ధవలేశ్వరావు లిల్లీ పుష్పనాతము తిర్లంగి ఉపేంద్ర కుమార్ కోరాడ బాబు బంకి లక్ష్మణమూర్తి కోడెం విజయకుమార్ కిల్లారి మోహనరావు,దుంపల రమేష్ బాబు కురుపాము పాలకొండ నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆశక్తి పెరగాలి

- నిర్దేశించిన మొతాదులో ఎరువులు వాడాలి
- రైతులకు కలెక్టర్ సూచన

విశాలాంధ్ర-కురుపాం : ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులు అవగాహన ,ఆశక్తి పెంచుకోవాలని, వీలైనంత వరకు సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రైతులకు సూచించారు.. కురుపాం మండలంలోని ఉదయపురం గ్రామాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. అక్కడి రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అధిక మోతాదులో ఎరువుల వినియోగం వలన పంటకు, ఆరోగ్యానికి హానికరమన్నారు. నిర్దేశించిన మోతాదులోనే యూరియాను వినియోగించాలని, ఈ విషయాన్ని రైతులు గ్రహించాలని సూచించారు. అధిక యూరియా వినియోగానికి బదులుగా నానో మరియు ఇతర జీవన ఎరువులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. నానో యూరియా, డిఏపిని వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. నానో యూరియా, డిఏపి అందరికీ అందుబాటులో ఉన్నాయని, అవసరం మేరకు వాటిని వినియోగించాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా నానో యూరియా, డిఏపిని రైతులకు కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థినులతో ముచ్చటించారు.

కాసేపు ఉపాధ్యాయుడిగా : ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల లోతరగతులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నిస్తూ పాఠ్యంశాలను బోధించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని ఉపాధ్యాయులు ను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతులు లోటు ఉండరాదని, ఎల్లవేళలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అక్కడి నుండి గుమ్మా గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన రోగులకు కాల్షియమ్, ఇతర టాబ్లెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. తదుపరి మొండెంకల్లులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, మందులను పరిశీలించి, రోగులకు మంచి సేవలు అందించాలని వైద్యులను కోరారు. తదుపరి ఆ గ్రామంలోని చెరువును పరిశీలించి ఆర్.ఆర్.ఆర్ కింద జంగిల్ క్లియరెన్స్ చేసి, ఆదర్శవంతమైన చెరువుగా దీన్ని తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కురుపాంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు తోయక జగదీశ్వరితో కలిసి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు. ఈ పర్యటనలో జిల్లా లెప్రోసి, ఎయిడ్స్, హెచ్.ఐ.వి మరియు టిబి నియంత్రణ అధికారి డా. ఎం.వినోద్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మచంద్రా రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.జగదీశ్వర రావు, ఇతర వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల 15 గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయండి

తెదేపా జీ.కే వీధి మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు



విశాలాంధ్ర-జీకే విధి : గూడెం కొత్తవీధి మండలంలో 16 పంచాయతీలలో 15 గ్రామాలు మారుమూల గ్రామాలు కావడం వలన రోడ్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ 15 గ్రామాలకు సంబంధించి ఆ మెటల్, బిటి సిసి రోడ్లు మంజూరు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీ.ఈ.ఈ రఘునాధరావుకి వినతిపత్రం సమర్పించిన గూడెం కొత్త వీధి తెదేపా నాయకులు.వంచుల పంచాయతీ అడగరపల్లి, జె. కొత్తూరు,మండలంలోని కాకరపాడు, పనసాల లోది తదితర గ్రామంలో బీటి, మెటల్,సిసి రోడ్లు నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వంచుల పంచాయతీ జనసేన అధ్యక్షులు కూడ మధు కుమార్, జీ.కే వీధి క్లస్టర్ యూనిట్ ఇంచార్జి వడేలి పాండురాజు, ముర్ల భూపతి పాల్గొన్నారు.

కాఫీలో కాయాతొలుచు తెగులు బెర్రీ బొర్రార్ నివారణపై అవగాహన

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలోని కాఫీ సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు కాఫీ పంటలను పీడిస్తున్న కాయ తొలిచూ పురుగు యొక్క తెగులు (బెర్రీ బోరర్) పై నివారణ కోసం,కాఫీ పంటలను నాశనం చేస్తున్న కాయ తొలుచు పురుగు బెర్రీ బోరార్ పై అవగాహన సభలు అన్ని గ్రామ పంచాయితీలలో నిర్వహిస్తున్న కార్యక్రమం లో భాగంగా వంచుల, దామానాపల్లి మరియు సంకాడ గ్రామ పంచాయితీలలో కాఫీ రైతులకు ప్రత్యేక అవగాహన సభల కాఫీ తోటలను సందర్శించి అవగాహన కల్పించే కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలాసుందర్, జీ.కే.విధి తాసిల్దార్ అన్నాజీరావు, ఎంపీడీవో ఇమాన్యుల్ పలువురు అధికారులు పాల్గొని అవగాహన నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలోని కాఫీ సాగు చేస్తున్న రైతులు ఈ బర్రి బోర్డర్ పురుగు యొక్క సంకేతాలు తెగులులు మీ తోటలలో కనిపించినట్ల యితే తగిన జాగ్రత్తలు పాటిస్తూ సంబంధిత అధికారులకు తెలియజేయాలని వారు కోరారు.పురుగు నివారణ కోసం కాఫీ సాక ద్వారా మందులు పంపిణీ చేసి నివారణ చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీవో రాంప్రసాద్,హెచ్ ఓ, విఏఏఎస్, ఎన్.ఆర్.ఇజిఎస్ సిబ్బంది,కాఫీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరం : టిడిపి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో ఈనెల 8, 9, తేదీలలో పరద ముంపు గ్రామాలలో పర్యటించి , వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, కూ టమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం రేఖ పల్లి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అసలు గత ప్రభుత్వంలో ఎంత గొప్ప సహాయక చర్యలు చేసిందో అందరకీ తెలుసు అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకం అమలు జరగడం లేదని అనంతబాబు ధనలక్ష్మి విమర్శిస్తున్నారని మీ వైసిపి కార్యకర్తల బ్యాంక్ అకౌంట్ ఒకసారి చెక్ చేసుకుని మాట్లాడాలని తెలియజేశారు లంచాలు తీసుకోవడం రంగురాళ్లు అమ్మడం మర్డర్ చేసి డోర్ డెలివరీ చేయడం లాంటివి కూ టమి ప్రభుత్వానికి అలవాటు లేదన్నారు. ఇప్పటికీ యూరియా విఆర్ పురం మండలంకు 32 టన్నులు యూరియా వచ్చిందని రైతులకు అందజేయడం జరిగిందన్నారు .వచ్చేవారం లోనే మరో 40 టన్నులు యూరియా వస్తుందని తెలిపారు.ఇది పనిచేసే ప్రభుత్వం మనీ జనాల్ని మభ్య పెట్టేది కాదు అన్నారు, పోలవరం నిర్వాసితుల రైతులకు గత ప్రభుత్వం ఐదు లక్షలు ఇస్తామని చెప్పి మోసం చేసింది మీరు కాదా?

నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ 10 లక్షలు ఇస్తామని చెప్పింది ఎవరు? అని ప్రశ్నించారు , ప్రజలు ఏదీ మర్చిపోలేదు వారికి అన్నీ తెలుసు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చుకుని త్వరలో ఇదే ప్రభుత్వం కావాలని ప్రజల ద్వారా మన్ననలు పొందుతామని మీరు ఎన్ని చేసిన తప్పులకు శిక్ష అనుభవించుతారని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, మాజీ ప్రెసిడెంట్ పూర్వ నరసింహారావు, సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య, వైస్ ఎంపీపీ వడ్డానపు భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వర రెడ్డి, కన్వీనర్ ముత్యాల సిద్దు, దేవస్థానం బొర్రా ఆదినారాయణ, ముత్యాల చంద్రశేఖర్, కోట్ల బాలయ్య, పాయం రామారావు, బీరక ప్రకాష్‌రావు, బొర్రా సూరి, జనసేన మండల అధ్యక్షుడు మూలకాల సాయికృష్ణ, కార్యదర్శి బాగుల అంజన రావు, బిజెపి అధ్యక్షులు ముత్యాల రాంబాబు కడుపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ లక్ష్యం కలిగి ఉండాలి : నాగేశ్వరరావు

విశాలాంధ్ర-కురుపాం : విద్యార్థి దశ నుండే సక్రమంగా చదువుకొని ఉన్నత లక్ష్యం కలిగి ఉండాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వై. నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి అధ్వర్యంలో ప్రెస్సర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక క్రీడ రంగాల్లో కూడా రాణించి కళాశాలకు తల్లితండ్రులకు మంచి పేరును తీసుకురావాలని ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈకార్యక్రమంలో చినమేరంగి కళాశాల ప్రిన్సిపాల్ రవణ, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ సారూ... మా సమస్యలు పరిష్కరించండి...

ఆదివాసీ జేఏసీ అభ్యర్థన

విశాలాంధ్ర-కురుపాం : మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కురుపాం మండలం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించి న సందర్భంగా ఉదయపరంలో ఆదివాసీ జెఏసి సభ్యులు కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి తరుపున ఉదయపురం పంచాయతీ ఆదివాసీలా సమస్యలు వివరించటం జరిగిందని అందులో 1) ఆరోగ్య హెల్త్ సెంటర్, 2) అంగన్వాడీ నూతన భవనం, 3) సచివాలయం నిర్మాణం పూర్తి చేయాలి, 4) గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పాత భవనాలు తొలగించి నూతన భవనాలు నిర్మించాలి, 5) పాఠశాలలో సుమారు 220 మంది విద్యార్థినిలు కలరు విద్య మౌలిక వసతులు అందించాలి 6) పాత భవనాలు వర్షం వస్తే నీరు కారుతు గాలి తుపానులకు ఎప్పుడు పడిపోతుందో భయందోళనలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. 7) ఆదివాసీలందరికి కొండ పోడు పట్టాలు ఇప్పించాలి. 8) సమగ్రంగా భూమి సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు ఆదివాసీ జెఏసితరుపున ఊయక తిరుపతి రావు (జాయింట్ సెక్రటరీ) అలానే పిసా ఉపాధ్యక్షులు ఊయక నిలమ్మ, విద్య కమిటీ చైర్మన్ అరిక శిరీష, ఉప సర్పంచ్ ఊలక నాగభూషణ రావు, వార్డు మెంబర్స్ ఊలక రాజేంద్ర దొర వినతిపత్రం అందజేశారు.

కాఫీ పంటకు నష్టం కలిగించే బేరి బోరర్ వ్యాధిపై రైతులకు అవగాహన

మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావు

విశాలాంధ్ర-చింతపల్లి : కాఫీ పంటకు తీవ్రంగా నష్టం కలిగించే బేరి బోరర్ వ్యాధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చింతపల్లి మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఆనందరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి సీతామహాలక్ష్మి, వెలుగు ఏపిఎం శ్రీనివాసరావు,, ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు, గొంది పాకల సర్పంచ్ సాగిన వరలక్ష్మి, ఎం పి టి సి సభ్యుడు తాంబేలి మోహన్ రావు,కూటమి నాయ కులతో గొందిపాకల గ్రామం లో మంగళ వారం గ్రామసభ నిర్వహించి, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భం గా ఆయస మాట్లాడుతూ గొందిపాకలు ప్రాంతంలోని కాఫీ పంటలను పరిశీలించడం జరిగిందన్నారు . కాఫీ పంటకు ఎక్కడ బేరి బోరర్ లక్షణాలు కనిపించ లేదన్నారు. బేరి బోరర్ వ్యాధిపై రైతులు ఆందోళన పడవలసిన అవసరం లేదన్నారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో, సచివాలయ సిబ్బంది ద్వారా ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గొందిపాకల పంచాయతీ కాఫీ రైతులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-కురుపాం : విద్యార్థులు శక్తి ఏప్ పై అవగాహన కలిగి ఉండాలని ఎఎస్ఐ ఎల్.శ్రీనివాస్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు డిగ్రీ కళాశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం శక్తి యాప్ పై ఏఎస్ఐ లంక శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం శక్తి యాప్ అనేది ఎంతగానో ఉపయోగపడుతుందని కావున ప్రతి ఒక్కరు మొబైల్ లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు మరియు గ్రామాల్లో అవగాహన కల్పించాలని అంతే కాకుండా అత్యవసర సమయంలో శక్తి యాప్ నెంబర్ 112 కు కాల్ చేయాలని అలా అయితే ఆపద సమయంలో ఉన్న మహిళలకు పోలీసులు నుండి వెంటనే రక్షణ కలుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు పంపిణీలో ప్రోటోకాల్ పాటించని అధికారులు



విశాలాంధ్ర - ఎటపాక : రేషన్ కార్డులు పంపిణీలో అధికారులు ప్రోటో కాల్ పాటిం పాటించడం లేదని గన్నవరం ఎంపీటీసీ కంటే రాజు ఆరోపించారు. మంగళ వారం ఎటపాక మండలం గన్నవరం లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీలో ప్రజా ప్రతినిధులకు ముందుస్తు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ప్రజా ప్రతి నిధులు లేకుండా స్థానిక నాయకులు చేతులతో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెన్షన్లు, సంక్షేమ పథకాలు పంపిణీలో ప్రజా ప్రతినిధులు కన్నా ముందు నాయకులు అని చెప్పుకునే వారికే అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన వాపోయారు. ఇకనైన అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను గుర్తించి వారికి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ముందుస్తు సమాచారం ఇవ్వాలని కోరారు.

అంగవైకల్యమే కాదు... ప్రభుత్వ పథకంలోనూ ఆ కుటుంబానికి శాపమే

- ఒకే కుటుంబంలో పుట్టిన ఆరుగురు సంతానంలో ముగ్గురు వికలాంగులే
- ఒక్కరికే పథకం వర్తింపు
- జీవన పోరాటంలో సతమతమవుతున్న తల్లిదండ్రులు
- ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న జనసేన నాయకుడు రామకృష్ణ

విశాలాంధ్ర-చింతపల్లి : అంగవైకల్యమే కాదు.. ఆ కుటుంబానికి ప్రభుత్వ పథకంలోనూ అన్యాయమే జరుగుతుంది. ఆ కుటుంబానికి ఆరుగురు సంతానం ఉంటే వారిలో ముగ్గురు వికలాంగులే ఉన్నారు. రేషన్ కార్డు రిత్యా ఆ కుటుంబానికి ఒక్కరికి మాత్రమే వికలాంగ పెన్షన్ అందుతుంది. దీంతో ఆ వికలాంగులతో పాటు మిగిలిన ముగ్గురి ఆలనా పాలన చూసే బాధ్యత తల్లిదండ్రులపై ఉండడంతో వారు వికలాంగులను విడిచి ఎక్కడికి పోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. జనసేన నాయకుడు రామకృష్ణ అందించిన వివరాలు ప్రకారం మండలంలోని ఓ గిరిజన కుటుంబం దయనీయ స్థితిలో జీవన పోరాటం సాగిస్తోందని, ఆరుగురి సంతానంలో ముగ్గురు అంగవైకల్యం బారిన పడటంతో ఆ కుటుంబ జీవితం కష్టాల మయమైంది. తాము చేసిన పాపమో, లేక దేవుడు పెట్టిన శాపమో తెలియక ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన చూస్తే ఎవరి హృదయమైనే ద్రవించక మానదన్నారు. మండలంలోని పెదబరడ పంచాయతీ సిరిపురం గ్రామానికి చెందిన కిల్లో నాగేశ్వరరావు, గౌరీ దంపతులకు ఆరుగురు సంతానం. వారిలో ప్రవీణ్ (14), నిఖిల్ (10), శ్రావణి(7) అనే ముగ్గురు చిన్నారులు అంగవైకల్యం (పోలియో)తో బాధపడుతున్నారు. నడవడం, నిలబడడం, ఆడుకోపడం%ా% అన్నీ వారికి అసాధ్యం. తమ పయసులోని పిల్లలు పాఠశాలకు వెళ్తున్నప్పుడు వీరి కదలికలు మాత్రం తల్లిదండ్రుల సహాయానికే పరిమితమై పోతున్నాయి. కాగా ప్రవీణ్‌కు మాత్రం వికలాంగ పించన్ 6000 అందుతున్నాయని, కానీ అవి మిగిలిన వారి పోషణకు ఏమాత్రం చాలడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.. ఇప్పటికే వెనుకబడిన ఈ గిరిజన కుటుంబం పిల్లల వైద్య ఖర్చులు భరించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. కుటుంబ పోషణ ఒకవైపు, పిల్లల వైద్యం మరోవైపు %-% ఈ ద్వంద్వభారం తల్లిదండ్రులకు మరింత ఆర్థిక భారంగా తయారైంది. ప్రతి రోజు వారి పోసన తల్లిదండ్రులకు సవాలుగా మారింది. వారి బాధను తల్లిదండ్రుల కన్నీటి చారలు మాత్రమే చెబుతున్నాయి. మన్యంప్రాంతంలో ఇప్పటికీ పౌష్టికాహార లోపం, వైద్య సదుపాయాల కొరత, అవగాహన లేకపోవడం వంటి కారణాలతో చిన్నారులు అంగవైకల్యాల బారిన పడుతున్నారు. నేటి ఆధునిక వైద్యరంగం ఎంత ముందుకు వెళ్లినా, ఈ వెనుకబడిన గిరిజన కుటుంబాల వద్ద పరిస్థితి మాత్రం మారడం లేదు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు రామకృష్ణ, జన సైనికులు శ్రీకాకుళం ఏసుబాబు, గెమ్మెలి సాయిబాబు, గెమ్మెలి నాయుడు, మర్రి రాజబాబు లతో కలిసి ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించి, కుటుంబాన్ని పరామర్శించాడు. దయనీయ స్థితిలో ఉన్న ఆ కుటుంబ పరిస్థితిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబానికి సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఈ పిల్లలకు తక్షణ వైద్య సహాయం, విద్య, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆ చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇప్పటివరకు తమను ఏ నాయకుడు పరామర్శించలేదని, అందుతున్న ఒకే ఒక ప్రభుత్వ పథకంతో పిల్లల పోషణ కష్టమవుతుందని, ముగ్గురిని ఒకేసారి చూసుకోవడం చాలా భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ ముగ్గురు అమాయక చిన్నారుల కళ్లలో వెలుగు నింపడం సమాజం అందరి బాధ్యత. ఒకరి చేయూతతో మరొకరి జీవితం మారిపోతుందనడంలో సందేహం లేదు. ఆ దిశగా ఆ కుటుంబానికి సహాయం అందించేందుకు స్థానిక ప్రజలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జన సైనికుడు రామకృష్ణ విజ్ఞప్తి చేస్తున్నారు.

చంద్రన్న భీమా పథకం పునరుద్ధరించాలి

తల్లితండ్రులు మృతి చెంది, అనాధలుగా మిగిలిన పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్.

విశాలాంధ్ర-చింతపల్లి : చంద్రన్న భీమా పథకం పునరుద్ధరించాలని, అదే క్రమంలో తల్లితండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయస మాట్లాడుతూ అల్లూరి జిల్లా చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ గర్లి గెడ్డ గ్రామానికి చెందిన కొర్ర భీమన్న కుమారుడు కొర్ర సీతారాం(35) అనారోగ్యంతో బాధపడుతూ చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, పరి స్థితి విషపించడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్ కు తరలించినప్పటికీ మృతి చెందారన్నారు. మృతి చెందిన కొర్ర సీతారాం. భార్య దేవుడమ్మ గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందారన్నారు. కాగా కుటుంబంలో భార్యా భర్తలు ఇరువురు చనిపోవడం తో ముగ్గురు చిన్న పిల్లలు అనాథలుగా మిగిలి పోయారన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం చంద్రన్న బీమా అమలు చేసిందన్నారు. 18 ఏళ్ల నిండి 60 ఏళ్ళు లోపు కుటుంబంలో ఎంత మంది ఉన్నా వారందరికీ చంద్రన్న బీమా పథకం అమలు చేసిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందితే రెండు లక్షలు రూపాయలు, హఠాత్తుగా ప్రమాదం లో మృతి చెందితే ఐదు లక్షలు రూపాయలు నామిని అకౌంట్లో నెల 15 రోజుల్లో జమ చేసేవారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మృతి చెందిన వెంటనే తక్షణం సాయంగా ఐదు వేల రూపాయలు వెలుగు సిబ్బంది ద్వారా ఇచ్చే వారని అన్నారు. ఇలా ఉండగా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కుటుంబ యజమానికి మాత్రమే వైయస్సార్ భీమా పథకం కల్పించిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైయస్సార్ భీమా పథకం ను తొలగించిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చంద్రన్న భీమా పథకం పునరుద్ధరణ చేసి కుటుంబంలో 18 నుండి 60 ఏళ్ళ లోపు ఉన్న ప్రతి ఒక్కరికి చంద్రన్న భీమా పథకం అమలు చేయాలని, అలాగే కొర్ర సీతారాం కుటుంబానికి చెందిన చిన్న పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు మజ్జి రాంబాబు, బురిడి నారాయణ రావు, బురిడి రఘురామ్, కే రాము, కేసత్తిబాబు., సేవకులు.జి.జానీ బాబు, డేవిడ్ రాజు, విజయ కుమార్, చిరంజీవి, బి రాజేష్, జి కొత్తన్న, పెసా కమిటి నాయకులు జి అప్పల స్వామి, కే.రాజుబాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని పిప్పల భద్ర గ్రామానికి చెందిన మజ్జి భవ్య శ్రీ (15) అనే విద్యార్థిని కనిపించడం లేదని తండ్రి మజ్జి సింహాచలం చిన మేరంగి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఆమె పిప్పలభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 10 వ తరగతి చదువుకుంటోందని తండ్రి సింహాచలం తెలిపారు. 6వ తేదీన పాఠశాలకి వెళ్ళివస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లిపోయిందని పాఠశాల కు వెళ్లి తమ కుమార్తె కోసం వెళ్లి ఉపాధ్యాయులకు అడుగగా మీ అమ్మాయి రాలేదని వారు చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు అప్పటినుండి బంధువుల ఇళ్లకు వెళ్లి వాకపు చేసిన ఎవరుకూడా మా ఇంటి వద్దకు రాలేదని చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దర్యాప్తు ప్రారంభించనున్నట్లు చినమేరంగి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి.అనిష్ తెలిపారు